Navya

ఆంధ్రజ్యోతి

# నవ్య

8 అక్టోబరు 2007

సోమవారం

• VOICE OF THE NEW WOMAN •




# స్వానుభవంతోనే ఈ సేవలకు పూనుకున్నా...


డా- ఉషాలక్ష్మి


ఆమె పేరు ఉషాలక్ష్మి. గైనకాలజిస్ట్. ఆమె ప్రత్యేకత ఏమిటంటారా? దేశంలో టాటా కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ తరువాత అంతే పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదుపాయాలతో హైదరాబాద్‌లో ఉషాలక్ష్మి బ్రెస్ట్ కాన్సర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్నారు. స్వయంగా బ్రెస్ట్ కాన్సర్ బాధితురాలు కూడా ఆమె. సరైన వైద్యం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దాని నుంచి ఆమె బయటపడ్డారు. అక్టోబర్ బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ నెల కావడంతో ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీలాబ్స్‌తో కలిసి బ్రెస్ట్ కాన్సర్ అవగాహనా కార్యక్రమాన్ని ఉషాలక్ష్మి చేపట్టారు. అంతేకాదు ఈ నెలలో ఎమ్‌కేసీ రోకో కాన్సర్స్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జర్మన్ బ్రెస్ట్ ట్రైనింగ్ ద్వారా ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలలో ఉచితంగా మహిళలకు మెమోగ్రామ్, బయాప్సీ సేవలు అందిస్తున్నారు. బ్రెస్ట్ కాన్సర్ గురించి ఉషాలక్ష్మి ఎన్నో విషయాలను పంచుకున్నారు. ఆమె మాటల్లోనే వాటిని తెలుసుకుందాం...



నేను పుట్టిపెరిగింది గుంటూరు జిల్లాలో. జూన్ 22వ తారీఖు 1933 వ సంవత్సరంలో పుట్టాను. మా నాన్నగారి ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించాలనే ప్రగాఢమైన కోరిక కలిగింది. మేము చదువుకునే రోజుల్లో స్త్రీలకు ఉపాధ్యాయవృత్తి, వైద్యవృత్తిలో తప్ప వేరే వాటిలో అవకాశాలు లేకపోవడం చేత, వైద్యవృత్తి పట్ల నాకున్న ప్రత్యేకమైన శ్రద్ధ వల్ల కూడా ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎమ్.బి.బి.ఎస్. పూర్తి చేశాను. తరువాత అక్కడే డిజిఓ, ఎమ్‌డి 1962లో పూర్తిచేశాను. అదే సంవత్సరం పెళ్లి యింది. గైనకాలజిస్ట్‌గా మంచిపేరు తెచ్చుకున్నాను. మా అబ్బాయి పుట్టిన తరువాత హైదరాబాద్‌లో స్థిర పడ్డాం. ప్రభుత్వ వైద్యురాలిగా గోల్కొండ, సుల్తాన్ బజార్ మెటర్నిటీ, నిలోఫర్ ఆసుపత్రిలలో సేవలు అందించాను. 1983లో వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. మా అబ్బాయియుకెలో డాక్టరుగా చేస్తుండేవాడు. 2002లో నేను మావారితో కలిసి అక్కడకు వెళ్లాను.

ఒకసారి నా రొమ్ములో తేడాగా అనిపించి మా అబ్బాయితో చెప్పాను. వెంటనే పరీక్షలు నిర్వహించి నాకు రొమ్ము కాన్సర్ ఉన్నట్టుగా గుర్తించారు. ఆరోగ్య విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకునే నాకు కాన్సరంటే నమ్మలేక పోయాను. ఆ క్షణంలో ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను కూడా. ఆ సమయంలో ఎన్నో సందేహాలు నా మదిని తొలిచాయి. ఏమవుతుందో అనే ఆవేదన సైతం నన్ను వెంటాడింది. మళ్లీ మామూలుగా అవుతానో లేదోననే భయం కలిగింది. అయినా భయపడుతూ కూర్చుంటే లాభం లేదని ధైర్యాన్ని తెచ్చుకున్నాను. యుకెలోనే ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ తరువాత అవసరమయ్యే కిమోథెరపీ హైదరాబాదులోని నిజాం హాస్పటల్‌లో చేయించుకున్నాను. మానసికంగా, శారీరకంగా బాగా అలసిన నేను కుటుంబసభ్యుల సహకారంతో చాలా వరకూ కోలుకున్నాను. నాకు యుకెలో ఎన్నో సదుపాయాలు అందుబాటులో ఉండీ వైద్య పరిజ్ఞానం కూడా బాగా ఉండీ నేనే మానసిక ఇంత వ్యధకు గురయ్యానంటే సామాన్యుల పరిస్థితి ఏంటి అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనల ఫలితమే ఉషాలక్ష్మి బ్రెస్ట్ కాన్సర్ ఫౌండేషన్.

## తొలి అడుగులు...

రొమ్ము కాన్సర్ గురించి అందరిలో పూర్తి అవగాహన కలిగించాలన్నదే మా సంస్థ లక్ష్యం. ఎందుకంటే రొమ్ము కాన్సర్ రాకుండా నిరోధించలేము. కానీ ప్రారంభదశలో ఉన్నప్పుడే దీనిని గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చు. ముఖ్యంగా దీనితో బాధ పడేవారందరికీ చికిత్స గురించి, ఆపరేషన్‌కి ముందు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నది మా ప్రథమ సంకల్పం. యుకెలో ఎవరయినా చికిత్స కోసం వెడితే వైద్యుడిని సంప్రదించడానికి ముందుగా నర్సులు రొమ్ము కాన్సర్ గురించి పూర్తి అవగాహన కలిగించే కరపత్రాలు, పుస్తకాలు ఇస్తారు. అవి చదివిన తరువాత అతికొద్ది సందేహాలు మాత్రమే మిగులుతాయి. అదే విధంగా మేము కూడా అందరికీ అర్థమయ్యే విధంగా పుస్తకాలను ప్రచురించాలనుకున్నాం. మా అబ్బాయి యుకె వెళ్లి వాళ్ల అనుమతి తీసుకొని రెడ్డీస్ లేబ్ సహకారంతో వాటిని ప్రచురించాం.

## రొమ్ము కాన్సర్ బాధితులు...

రొమ్ములో కణాల పెరుగుదల జరిగి గడ్డలా తయారవుతుంది. దీనినే రొమ్ము కాన్సర్ అంటాము. మన దేశంలో సంవత్సరానికి కనీసం ఒక లక్ష కొత్త బ్రెస్ట్ కాన్సర్ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. వీరిలో పట్టణ ప్రాంత మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. దీనికి ముఖ్య కారణాలు తొందరగా రజస్వల కావడం. ఆలస్యంగా వివాహాలు కావడం వల్ల పెద్ద వయసులో పిల్లలు పుట్టడం. పిల్లలకు పాలివ్వక పోవడం లేదా పిల్లలు పుట్టకపోవడం. రక్త సంబంధీకులకు రొమ్ముకాన్సర్ రావడం వంటివి ఉన్నాయి.

## రొమ్ము కాన్సర్‌ను గుర్తించడం...

ఎవరి రొమ్ము భాగాన్ని వారు ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. రొమ్ము పరిమాణంలో మార్పుగానీ, నొప్పి రావడంగానీ, మొనభాగం లోపలికి లాగుతుండడం లాంటివి గమనిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సాధారణంగా 20 సంవత్సరాల వయస్సు వారిలో రొమ్ము కాన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. అదే విధంగా 40 సంవత్సరాల పైబడిన వారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక 40 సంవత్సరాలు దాటిన వారు ప్రతి రెండేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

## చికిత్స దశలు...

* మొదటిగా రొమ్ము భాగాన్ని పరీక్షించిన తరువాత మెమోగ్రాము చేయించుకోవాలి.
* మెమోగ్రాములో గడ్డ ఉన్నట్లు రిపోర్టు వస్తే బయాప్సీ చేయించాలి. ఎందుకంటే ప్రతీది రొమ్ము కాన్సర్ కాదు. కనుక అనుమానం ఉన్నచోట అల్ట్రాసౌండ్స్ ద్వారా చూస్తూ నీడిల్‌తో బయాప్సీ తీస్తారు. ఈ రిపోర్టులు 48 గంటల్లో వస్తాయి.
* రోగి మానసిక, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఏ పద్ధతిలో చికిత్స చేయాలో సర్జన్, అంకాలజిస్ట్, రేడియో థెరపిస్ట్, పెథాలజిస్ట్ కలసి నిర్ణయించి సైడ్‌ఎఫెక్ట్స్ తలెత్తకుండా, మరలా వచ్చే అవకాశం లేకుండా జాగ్రత్త పడతారు. బాధితులకు నేనిచ్చే సలహా ఒక్కటే కేవలం దీనిని వైద్యసహాయంతో మాత్రమే కాదు మానసిక ధైర్యంతో కూడా ఎదుర్కోవాలి.

- నవ్య డెస్క్

## రొమ్ము కాన్సర్ అవగాహనా వారోత్సవాల సందర్భంగా...



నా వయస్సు 28 సంవత్సరాలు. నా బుగ్గలు చాలా లోపలికి ఉంటాయి. బుగ్గలు బూరెల్లా అవడానికి ఏమైనా చేయవచ్చా? ఆపరేషన్ లేకుండా చేసే మార్గం చెప్పండి. మచ్చలు ఏర్పడతాయా? నాకు సర్జరీ అంటే భయం. ముఖం, శరీరం అంతా బాగానే ఉంటుంది కానీ బుగ్గలు గురించే నా ఆందోళన